


23న పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - భామిని

పత్తి రైతుల చిరకాల వాంఛ అయిన పత్తి కొనుగోలు కేంద్రం భామిని ఎఫ్‌సిఐ గోడౌన్‌లో సోమవారం ప్రారంభం కానుందని పాలకొండ ఎఎంసి కార్యదర్శి వారణాసి సతీష్ కుమార్ తెలిపారు. ప్రారంభం కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, ఎఎంసి జాయింట్ డైరెక్టర్ పాల్గొంటారని తెలిపారు.

ఏజెన్సీకి 'సిరివరా'లిచ్చేనా?

డిప్యూటీ సిఎం పవన్ పర్యటనపై గంపెడాశలు
గిరిజనులతో ముఖాముఖికి ఏర్పాట్లు
దీర్ఘకాలిక రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సిరివరకు వెళ్లే రోడ్డు

ప్రజాశక్తి - సాలూరు, మక్కువ

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ శుక్రవారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఆయన టూర్ షెడ్యూల్ అధికారికంగా విడుదల కానప్పటికీ జిల్లా అధికారుల హడావుడి చూస్తుంటే ఖరారయినట్లేనని తెలుస్తోంది. ఇప్పటికే మక్కువ మండలం పనసభద్ర పంచాయతీ బాగుజోలలో శిరివర రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా అక్కడ శిలాఫలకం నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ విజయనగరం నుంచి నేరుగా కారులో సాలూరు పట్టణానికి చేరుకుని మామిడిపల్లి, శంబర, మక్కువ మీదుగా బాగుజోల చేరుకుంటారు. సుమారు పది గిరిశిఖర గ్రామాల చిరకాల వాంఛ అయిన శిరివర రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడ సమీప గ్రామాల గిరిజనులతో ఆయన మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుంటారు. ఆ తర్వాత సాలూరు మీదుగా విజయనగరం చేరుకుంటారు.

'సిరి'వరాలిస్తారా?

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు చాలా ఉన్నాయి. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ రాక కోసం ఎదురు చూస్తున్నారు. దశాబ్దాల తరబడి తాము పడుతున్న కష్టాల గురించి ఆయనకు విన్నవించుకొనేందుకు గిరిజనులు సిద్ధమవుతున్నారు. శిరివర రోడ్డు నిర్మాణానికి వైసిపి ప్రభుత్వ హయాంలో అటవీ, పర్యావరణ అనుమతులు మంజూరు కావడంతో బిటి రోడ్డుకు లైన్ క్లియర్ అయింది. ఇప్పుడు అదే రోడ్డుకు శంకుస్థాపన చేయడానికి పవన్ కళ్యాణ్ బాగుజోల వస్తున్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే పది గిరి శిఖర గ్రామాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. తమ వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను మైదాన ప్రాంతంలో ఉన్న గ్రామాలు, పట్టణాలకు రవాణా చేసుకోవడానికి వీలు కలుగుతుంది. అనేక దశాబ్దాలుగా ఈ రోడ్డు కోసం పోరాడుతున్న గిరిజనుల చిరకాల వాంఛ నెరవేరనుంది. ప్రధానంగా జిల్లాలోని గిరిశిఖర గ్రామాల్లో విద్య, వైద్యం అందని ద్రాక్షలా మిగిలింది. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల్లేని పరిస్థితి వుంది. ఈ గ్రామాల్లో విద్య, వైద్యం అందించేందుకు వెళ్లే ఉద్యోగులు కూడా ప్రతి రోజూ రాకపోకలు సాగించడానికి సరైన రహదారులు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో గిరి శిఖర గ్రామాల గిరిజనులు అత్యవసర పరిస్థితుల్లో డోలీమోతల్లో రోగులను తరలించడమొక్కటే మార్గం గా కనిపిస్తోంది.

నిర్వీర్య మైన జిసిసి

గిరిజనుల కోసమే ఏర్పడిన గిరిజన సహకార సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా ఇప్పుడు నిర్వీర్యమైంది. ఒకప్పుడు గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేసేది. అటవీ ఉత్పత్తులపై గుత్తాధిపత్యం ఉన్నంతకాలం వాటిని నేరుగా గిరిజనుల నుంచి జిసిసి కొనుగోలు చేసేది. అయితే అటవీ ఉత్పత్తులపై జిసిసికి గుత్తాధిపత్యం తొలగించడంతో గిరిజనులు తమ ఉత్పత్తులను ప్రయివేటు వ్యాపారులకు, దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. జిసిసి ద్వారా ఇప్పుడు కేవలం నిత్యావసర సరుకుల పంపిణీ మాత్రమే జరుగుతోంది. గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తుల్లో చింతపండు ప్రధానమైంది. జిసిసి గత కొన్నేళ్లుగా చింతపండు కొనుగోళ్లను తగ్గించుకుంటూ వస్తోంది. ఫలితంగా గిరిజనుల ఉత్పత్తులకు మద్దతు ధర లభించడం లేదు.

దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం దొరికేనా..?

మక్కువ మండలంలోని అధిక శాతం గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అయినా పరిష్కరించే అవకాశం ఉందా అని ఈ ప్రాంత గిరిజనులు ఎదురుచూస్తున్నారు. దీర్ఘకాలిక సమస్యలుగా ఉన్న అడారు గడ్డపై వంతెన నిర్మాణం, దుగ్గేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు అధికారులకు ఫిర్యాదు చేసుకున్నా, సమస్యల అలాగానే మిగిలిపోతూనే ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఇదే నియోజకవర్గంలో డిప్యూటీ సిఎంగా పని చేసిన రాజన్నదొర ప్రతిపాదనలు చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఈసారి కూటమి ప్రభుత్వంలోనైనా తాము ఎదుర్కొంటున్న ఈ సమస్యలు పరిష్కారమైతే డోలీమోతలు తప్పి, మరణాలు తగ్గే ఆస్కారం ఉందని గిరిజనులు భావిస్తున్నారు. అలాగే వంతెన నిర్మాణం పూర్తయినట్లయితే 30 గ్రామాల గిరిజనులకు వారు పండించే పంటలను అమ్ముకునేందుకు రవాణాకు సౌలభ్యంగా ఉంటుందని ఇక్కడ గిరిజనులు అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారం చేయాలని డిప్యూటీ సిఎంను వారు కోరనున్నారు.

రక్తహీనతలో జిల్లా రెండో స్థానం

రాష్ట్రంలో రక్తహీనతతో బాధపడుతున్న జిల్లాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా మొదటి స్థానంలో వుంటే మన్యం జిల్లా రెండో స్థానంలో ఉంది. మన్యం జిల్లాలో గల నాలుగు నియోజకవర్గాల్లో మూడు గిరిజన నియోజకవర్గాల్లోనూ గిరిజన కుటుంబాలు అత్యధికంగా నివసిస్తున్నాయి. అక్షరాస్యతలోనూ బాగా వెనుకబడిన ఈ నియోజకవర్గాల్లో గిరిజన సాంప్రదాయాలు, ఆచారాలు విచిత్రంగా ఉంటాయి. బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతుండడం, పోషకాహార లోపం కారణంగా గిరిజనులు రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్నారు. గిరిశిఖర గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు ఉన్నప్పటికీ గిరిజనులకు వాటి ద్వారా పంపిణీ అవుతున్న పోషకాహారం అంతంత మాత్రమేనని చెప్పవచ్చు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువులను తీసుకోడానికి గిరిజనులు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోంది.



పాచిపెంట మండలంలో పొలాల్లో ఉన్న వరి ఓవులు

ముసిరేసింది

- జిల్లాలో పలుచోట్ల వర్షాలు
- వరి రైతులకు ఇబ్బందుల
- పెరిగిన చలితో ప్రజలు అగచాట్లు


ప్రజాశక్తి-పార్వతీపురం

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లా అంతటా ముసిరేయడంతో వాతావరణం బాగా చల్లబడింది. గురువారం జిల్లాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. నూర్పులు ఉధృతంగా సాగుతున్న సమయంలో వర్షాలు కురవడంతో అన్నదాతల్లో గుబులు రేగుతోంది. జిల్లాలో మరో రెండురోజులు పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో మరింత కలవరపడుతున్నారు.జిల్లా అంతటా వర్షాలు పడుతుండడంతో పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు వ్యయ ప్రయాసలు పడుతున్నారు. ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి ఆకాశం మేఘావృతమై చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు తీవ్ర చలిగాలులు వీయడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు.

వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. చాలాచోట్ల వరి కోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల పంట కోసి కుప్పలుగా వేశారు. అల్పపీడనం వల్ల వర్షాలు కురవడంతో రైతులు కలవరం చెందుతున్నారు.గురువారం కురుపాం, గుమ్మలక్ష్మీపురం, వీరఘట్టం, పాలకొండ, సాలూరు, సీతంపేట తదితర మండలాల్లో కురిశాయి.

భారీగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాపై చలి పంజా విసురుతోంది. వర్షాల నేపథ్యంలో చల్లని గాలులు వీస్తుండటంతో ఎముకలు కొరికే చలి ప్రజల్ని వణికిస్తోంది. గత వారం రోజులుగా పగటిపూట 22 నుంచి 23 డిగ్రీలు నమోదు కాగా, రాత్రి వేళల్లో 18 నుంచి 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతోంది. ఏజెన్సీలో ఇంకా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు చలితో వణికిపోతున్నారు. దీంతో పిల్లలు, వృద్ధుల్లో ఆస్తమా వంటి అనారోగ్య సమస్యలు ఎక్కువగా బయట పడుతున్నాయి.



మాట్లాడుతున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్నికల ముందు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఇతర కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ ఎదుట గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు మురళి, సురేంద్ర, జగదీష్, తిరుపతి నాయుడు, కామేష్, రమేష్, సన్యాసి రావు, భాస్కరావు, సింహాచలమమ్మ, కుమారి, సారధి, మౌళి, గౌరీ, కవిత, కళావతి, సీతమ్మ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం రాకతో బాగుజోల తళతళ

ప్రజాశక్తి - మక్కువ

కొండల నడుమ ఎత్తైన ప్రదేశంలో ఉన్న బాగుజోల రెండు రోజులుగా అధికారుల సందడితోనూ ఊరంతా కళకళలాడడమే కాకుండా కొన్ని హంగులు చోటుచేసుకుని తళతళ మెరిసిపోతోంది. దీనికి కారణం శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అక్కడకు అడుగుపెట్టనుడడం వల్ల అనడంలో సందేహం లేదు. సాలూరు నియోజకవర్గం మక్కువ మండల పనసభద్ర పంచాయతీ పరిధిలో గల బాగుజోల గ్రామానికి డిప్యూటీ సిఎం రానున్నారు. ఇక్కడ నుండి సుమారు జిల్లాలో సుమారు రూ.30 కోట్ల నిధులతో ఐటిడిఎ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా చేపట్టనున్న సుమారు 19 పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో భాగంగా సాలూరు మండలం కొదమ పంచాయతీ సిరివర గ్రామానికి రూ.9.50 కోట్లు నిధులతో 9.4 కిలోమీటర్ల బిటి రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ రెడ్డి దగ్గరుండి గురువారం ఏర్పాట్లను చేపట్టారు. అలాగే ఎఎస్‌పి అంకిత సురాన, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్ర రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. డిప్యూటీ సిఎంతో వచ్చే వాహనాలను నేరుగా బాగుజాలకు ఎదురుగా ఉన్న పంట పొలాల్లో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు. అలాగే సమావేశం లేనందున ఆయా గ్రామాల గిరిజనులతో డిప్యూటీ సిఎం మమేకం కానున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి.

బేస్ క్యాంప్ ముస్తాబు

డిప్యూటీ సిఎం సొంత శాఖ అటవీ శాఖకు సంబంధించిన బేస్ క్యాంపును అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బాగుజోల రిజర్వ్ ఫారెస్ట్ టేకు ప్లాంటేషన్ పరిసరాల్లో పవన్ కళ్యాణ్ పరిశీలించే ఆస్కారం ఉందని తెలుస్తోంది. అలాగే మధ్యాహ్నం భోజన విడిది కూడా అక్కడే ఉండబోతుందని, ఇందుకు అటవీశాఖ అధికారులు అంతా సిద్ధం చేస్తున్నారు. పరిశీలనలో డిఎల్‌పిఒ నాగేశ్వరరావు, డిపిఒ కొండలరావు, విద్యుత్ శాఖ ఎస్‌సి సిహెచ్.చలపతిరావు, డ్వామా పీడీ రామచంద్రారావు, ఐటిడిఎ, పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, మండల టిడిపి అధ్యక్షులు జి.వేణుగోపాల నాయుడు, తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, ఇఒపిఆర్‌డి దేవకుమార్ పాల్గొన్నారు.

రోడ్ల పనులకు శంకుస్థాపన
సర్వం సిద్ధం చేసిన అధికారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఎఎస్‌పి అంకిత సురాన

పింఛన్ల తొలగింపుపై పేదల్లో ఆందోళన

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో అనర్హుల ఏరివేత పేరుతో కూటమి ప్రభుత్వం పింఛన్లు తొలగిస్తుందనే భయాందోళనలో పేదలు ఉన్నారని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఒక చేతితో కొత్త పింఛన్లు మంజూరు చేసి మరో చేత్తో తొలగించడం టిడిపి ప్రభుత్వానికి మొదటి నుంచి అలవాటేనని చెప్పారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఇంటింటికీ వెళ్లి పింఛను డబ్బులు అందజేసిన ఘనత తమదేనని అన్నారు. గత కొద్ది నెలలుగా రాష్ట్రంలో లక్షా 50వేల పింఛన్లు తొలగిస్తారనే ప్రచారం జరుగుతోందని చెప్పారు. దీనివల్ల లబ్దిదారుల్లో భయాందోళన వ్యక్తమవుతోందని చెప్పారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం 66.35 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేసిందన్నారు. ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదలకు 50ఏళ్లకే పింఛను మంజూరు చేస్తామని టిడిపి హామీ ఇచ్చిందని, ఇంతవరకు దీని అమలుపై స్పష్టత లేదని అన్నారు. పింఛను పొందడానికి వయోపరిమితిని గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో 65 ఏళ్లకు పెంచితే వైసిపి ప్రభుత్వం 60 ఏళ్లకు తగ్గించిందని రాజన్నదొర గుర్తు చేశారు. విలేకరుల సమావేశంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి నాయకులు హరి బాలాజీ పాల్గొన్నారు.

పిహెచ్‌సిని పరిశీలించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల ఆరోగ్య తనిఖీ వివరాలు ఒపి రికార్డులో పరిశీలించారు. సీజనల్ వ్యాధుల ప్రభావం ఎక్కడైనా ఉంటుందా అని వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు గ్రామాల్లో విరివిగా సందర్శించి సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. పిహెచ్‌సిలో వ్యాక్సిన్ నిల్వలు పరిశీలించి వినియోగించిన, మిగిలిన స్టాకు వివరాలు ఎప్పటికప్పుడు ఇ-విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఫార్మసిస్టుకు సూచించారు. ఐఎల్ఆర్, బ్యాటరీ పనితీరును ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. అత్యవసర మందులు, కుక్క, పాముకాటు ఇంజెక్షన్ల లభ్యత పరిశీలించారు. కాన్పులు రిజిస్టర్ పరిశీలించారు. జనన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందజేయాలన్నారు. వార్డు, ల్యాబ్, లేబర్ రూం పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరు అడిగి తెలుసుకున్నారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ఆరా తీశారు. ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి నివేదికలు పురోగతి సాధించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. సాయంత్రం, రాత్రి వేళల్లో షిఫ్ట్ డ్యూటీ సిబ్బంది అందుబాటులో ఉంటూ, ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందజేయడంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మానస, కార్యాలయ డెమో యోగీశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎంహెచ్ఒ విజయపార్వతి

23న 104 ఉద్యోగుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23న విధులను బహిష్కరిస్తున్నట్లు 104 ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు ఆనందరావు, సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి నోటీసు ద్వారా తెలియజేశామని అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే జనవరి 5 నుంచి నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని అన్నారు. 104 సర్వీసులు ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, తద్వారా నెలకు తక్కువ ఖర్చుతో కేవలం 50వేలతో ఈ సర్వీస్‌లను నిర్వహించవచ్చన్నారు. 16ఏళ్ల నుంచి 104 సర్వీసులో పనిచేస్తున్న డిఎస్సీ, ఆర్వోఆర్ (డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ రూల్ ఆఫ్ రిజర్వేషన్) పద్ధతుల ద్వారా నియమించి సుదీర్ఘంగా సేవలందిస్తున్న 326 మంది సీనియర్ డ్రైవర్లను, ఇతర వైద్య శాఖలలో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని, అదే విధంగా 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని కోరారు. 2020లో విధుల్లో చేరిన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగులకు భద్రత కల్పించి జిఒ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, అరబిందో యాజమాన్యం నిర్లక్షంగా వ్యవహరించి ఇవ్వకుండా ఉన్న ఇంక్రిమెంట్లు, ఎరియర్ల రూపంలో ఇవ్వాలని. జీవో 44, 59 ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ గతంలో పాత యాజమాన్యమే కట్టిందని గుర్తు చేశారు. అలాగే ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించాలని, వాహనల ఫిట్, ఇన్సూరెన్స్ వెంటనే చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ శంకరావు దుర్గా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న 104 ఉద్యోగులు

ఆర్థిక అభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో చేపల పెంపకందారులు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి పలు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా చేపల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటుపై శిక్షణా తరగతుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపల సంపద అభివృద్ధి జరగాలని కోరారు. మత్స సంపద ద్వారా ఏడాదికి కేవలం రూ:194 కోట్లు మాత్రమే ఆదాయం చేకూరుతోందన్నారు. చేపల పెంపకంలో ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 96 వేల మంది ఆధారపడుతున్నారని అన్నారు. చేపల పెంపకంపై మత్స్యకారుల్లో ఉన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేయాలని జిల్లా మత్స్య శాఖ అధికారికి వేముల తిరుపతయ్యకు సూచించారు. జిల్లాలో సుమారు 1800 చెరువులున్నాయని, వాటిని చేపల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గంభూషియా, బ్లాక్ ఫ్లై చేపల పెంపకానికి చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి ఏటా నవంబర్‌లోగా మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణి చేయాలని డిఎఫ్ఒను ఆదేశించారు. సంఘం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ.2.50లక్షలు మంజూరు చేస్తుందని, వీటినిసక్రమంగా వినియోగిస్తే, రెండో విడతలో మరో రూ.2.50లక్షలు మంజూరు చేస్తుందని కలెక్టర్ వివరించారు. చేపల రవాణాకు బొలెరో వాహనాలు కావాలని ఉత్పత్తిదారులు కలెక్టర్‌ను కోరగా, పరిశీలించి చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖ అధికారికి సూచించారు. సంఘ సభ్యులు రూ.2వేలు ప్రభుత్వానికి ఈక్విటీ చెల్లిస్తే, వారికి ప్రభుత్వం రూ.4వేలు 15 రోజుల్లో చెల్లిస్తుందని పేర్కొన్నారు. అలాగే చేపల పెంపకంలో మహిళలకు శిక్షణ కల్పించాలని డిఎఫ్ఒకు సూచించారు. జిల్లాలో హేచరీకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. చేపల మార్కెట్‌కు వెళ్ళడానికి సరైన రహదారి సదుపాయాన్ని కల్పించేలా మున్సిపల్ కమిషనర్‌తో సంప్రదించాలని అన్నారు. జిల్లాలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయడానికి సాధ్యాసాధ్యలను పరిశీలించాలని సూచించారు. జిల్లాలోని జంఝావతి, తోటపల్లి, వెంగళరాయ సాగర్, పెద్ద గెడ్డ జలాశయంలో నీటిని పది శాతం కూడా చేపల పెంపకానికి ఉపయోగించడం లేదన్నారు. ప్రభుత్వం భూములు ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులను తవ్వించి, అక్కడ చేపలను పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. అవసరమైన జనరేటర్లను, షెడ్లను నిర్మించడం జరుగుతుంద న్నారు. అధిక మొత్తంలో చేపల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫిషరీస్ స్టేట్ కో ఆర్డినేటర్ కె. గంగాధర్, డిఆర్‌డిఎ ఎపిఎం కె.భారతి, స్వచ్ఛ సుందర పార్వతీపురం ట్రస్ట్ సభ్యులు పద్మజ, పునర్వి ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థ సిఇఒ హేమంత్, ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘ వైస్ ఛైర్మన్ దాసరి లక్ష్మణ్, ఎఫ్‌డిఒలు, మత్స్యకార సంఘ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

చేపల ఉత్పత్తిదారుల శిక్షణా తరగతుల్లో కలెక్టర్



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న మత్స్య ఉత్పత్తిదారు సంఘ సభ్యుడు


ఆర్‌టిసి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రజా రవాణా సేవలు మరింత మెరుగు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర సూచించారు. గురువారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో ఆర్టీసీ అధికారులు, డిఎం కనకదుర్గ కలిశారు. ఈనెల 21న రాష్ట్ర రవాణాశాఖమంత్రి రాంప్రసాద్ రెడ్డి జిల్లా కేంద్రంలో కొత్త బస్సులను ప్రారంభించనున్న కార్యక్రమానికి అధికారులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా అధికారులతో ఎమ్మెల్యే వివిధ అంశాలపై చర్చించారు. పల్లె ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలందించాలని, అలాగే కాంప్లెక్స్, ఇతర చోట్ల సౌకర్యాలు మెరుగుపడాలని సూచించారు. ఇంకా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని, తదితర అంశాలపై ఎమ్మెల్యే చర్చించారు. రవాణాశాఖ మంత్రి పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

20న రవాణా శాఖ మంత్రి రాక

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి శుక్రవారం పార్వతీపురం వస్తున్నారు. ఈనెల 21న ఉదయం పార్వతీపురం బస్ డిపోలో కొత్త బస్సులను ప్రారంభిస్తారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు విశాఖపట్నం వెళతారు.

నేటి నుంచి మెగా వాలీబాల్ టోర్నీ


ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 20 నుంచి 24 వరకు ఐదు రోజులు కురుపాంలో గల సాయిరాం గుడి ఎదురు మైదానం వద్ద మెగా వాలీబాల్ టోర్నీ నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలో వాలీబాల్ ఆడదల్చుకున్న క్రీడాకారులు కానిస్టేబుళ్లుటిబి రాయుడు 9490948640, ఎన్.కేశవరావు 9346330827 ఫోన్ నెంబర్లకు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. గెలుపొందిన టీములకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 7వేలు నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతో ఉండాలని ఎస్ఐ లంక శ్రీను వాసరావు అన్నారు. గురువారం సంకల్పం లో భాగంగా మండలంలోని చినబోగిలిలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ మీకు తెలియని వ్యక్తుల నుంచి లింకులు పంపిస్తే ఓపెన్ చేయొద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైం, ఆన్లైన్ మోసాలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్, గ్రామస్తులు పాల్గొన్నారు.


గోసాల పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

గోశాల పనులు వేగవంతం

ప్రజాశక్తి - సీతానగరం

గోశాలల పనులు పూర్తి చేయాలని ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు అన్నారు. మండలంలోని ఆర్.వెంకంపేటలో జరుగుతున్న గోశాల పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 23 గోశాలు మంజూరయ్యాయని, పనులను పూర్తి చేయాలని, రైతులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టం నిధుల ద్వారా ఈ పనులు జరుగుతున్నాయన్నారు. పనులను రైతులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు.

ఫుల్ జోష్‌లో జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి - సీతానగరం

జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మన్యం జిల్లాకు అధికారం చేపట్టాక మొట్టమొదటిసారిగా వస్తుండడంతో జనసేన కార్యకర్తలు ఫుల్ జోష్‌గా కనిపిస్తున్నారు. సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ ఆధ్వర్యంలోని మండల ఉపాధ్యక్షులు వెంపటాపు సుగుణేశ్వరరావు, కార్యకర్తలు స్వాగత ఏర్పాట్ల ఘనంగా చేస్తున్నారు, సుమారు 15 కిలోమీటర్ల పొడుగున స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మండలానికి అధినాయకులు రావడంతో పార్టీ మరింతగా బలోపేతమయ్యే ఆస్కారం ఉందని వారంతా ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు

చెరువు ఆక్రమణలను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక రైతు బజార్ సమీపంలో ఉన్న నెల్లిచెరువు ఆక్రమణలను ఎమ్మెల్యే విజయ్ చంద్ర గురువారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. చెరువు గర్భంలో నిర్మించిన భవనాలు, ఇతర కట్టడాలను పరిశీలించారు. పట్టణ నడిబొడ్డున ఎంతో ఉపయోగమైన చెరువు ఇష్టారాజ్యంగా ఆక్రమణకు గురి కావడం సరైంది కాదని, అధికారులు దీనిపై తక్షణం స్పందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారందరికీ నోటీసులు జారీ చేయాలని అన్నారు. నెల్లిచెరువు గట్టుపై అనేక ఏళ్లుగా నివసిస్తున్న పేద కుటుంబాలు ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి వారి సమస్యలు విన్నవించుకన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

భామిని సమీపంలో ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - భామిని

గత వారం రోజులుగా మండలంలోని పసుకుడి, మూలగూడ పరిసర ప్రాంతాల్లో 4 ఏనుగుల గుంపు సంచరించేవి. ఇవి ప్రస్తుతం భామిని, లివిరి, వంశధార నది పరిసరాల్లో సంచరిస్తున్నాయి. ఏనుగులు సంచరించే పరిసర ప్రాంతాల్లో పత్తి పంట ఉందని, పత్తి తీయటానికి వెళ్లే కూలీలపై ఏనుగు దాడి చేస్తాయేమోనని స్థానికులు భయపడుతున్నారు. అటవీశాఖాధికారులు చొరవ తీసుకుని ఏనుగుల సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

26న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 26న మండల సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు తెలిపారు. ఎంపిపి బలగ రమణమ్మ అధ్యక్షతన స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో జరగనున్న ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు అధికారులంతా పూర్తి సమాచారంతో సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు. అలాగే సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు కూడా హాజరు కావాలని కోరారు.


ఘనంగా క్రిస్మస్ ఆరాధన

సీతంపేట : మండలంలోని అక్కన్నగూడలో గురువారం ఘనంగా క్రిస్మస్ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌టిబిఎ సంస్థ డైరెక్టర్ అంజూరు పిలుప్ తిమోతి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ప్రార్థనలు చేశారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో 80 స్వయం పోషక సంఘాలు నడుస్తున్నాయని చెప్పారు. ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు మహాసభలు జరుగుతాయన్నారు. ప్రజలు. అధికారులు ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థనల చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు జాన్ సింహాచలం, భాస్కరరావు, సర్పంచ్ ఆనందరావు, జగదీష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నియోజకవర్గంలోని రహదారి నిర్మాణాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం పెదమేరంగి జంక్షన్ రోడ్డు నుంచి వెంకటరాజపురం వరకు రూ.2కోట్ల 60 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి రహదారిని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇకపై ఏ గ్రామానికి సరైన రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడకూడదనే నినాదంతో ప్రభుత్వం ముందుకెళ్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, ఎంపిపి బొంగు సురేష్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, నాయకులు వెంపటాపు భారతి, దాసరి రామారావు, వారణాసి శివ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కూటమి ప్రభుత్వంతోనే విద్యాభివృద్ధి : ఎమ్మెల్యే

కురుపాం : కూటమి ప్రభుత్వంతోనే విద్యాభివృద్ధి సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.50 లక్షల 91వేలు సమగ్ర శిక్ష నిధులతో మంజూరైన నిర్మాణం పూర్తయిన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మారుస్తుందని, కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పాఠశాల దశ నుంచే నాణ్యమైన విద్యను పొంది ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఉమామహేశ్వరి, హెచ్ఎం టి.శంకరరావు, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మండల కన్వీనర్ కెవి కొండయ్య, మాజీ ఎంపిపి జివి రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ ఎస్.సుధా, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేశ్వరరావు, కురుపాం జనసేన మండల కన్వీనర్ నేరేడుబిల్లి వంశీ, టిడిపి నాయకులు చందక రామకృష్ణ, సువ్వాడ గోవింద పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

హోంమంత్రి క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - సాలూరు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను స్మరించరాదంటూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఆయన క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దేశంలో గల ఎస్సీ, ఎస్టీ, బీసీల దృష్టిలో అంబేద్కర్ దేవుడేనని చెప్పారు. ఆయన్ను అవమానించే రీతిలో హోం మంత్రి అమిత్ షా మాట్లాడడం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. ఆయన బేషరతుగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడు, పట్టణ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య పాల్గొన్నారు.

మంత్రివర్గం నుంచి అమిత్ షా ని తొలగించాలి : గొంప ప్రకాశరావు

దేశం గర్వించదగ్గ మహానుభావుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నుద్దేశించి కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన అభ్యంతకర వ్యాఖ్యల దృష్ట్యా ఆయన్ను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర నాయకులు గొంప ప్రకాశరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల బట్టి అంబేద్కర్‌పై బిజెపి అగ్రనేతల వైఖరి తేటతెల్లమైందని చెప్పారు. దేశంలోని మెజారిటీ ప్రజల ఆరాధ్య దైవం లాంటి అంబేద్కర్‌ను స్మరించరాదంటూ అమిత్ షా మాట్లాడడం క్షమార్హం కాదన్నారు.

20 గ్రామాల్లో నేడు పీసా ఎన్నికలు

ప్రజాశక్తి - సీతంపేట

పీసా ఎన్నికల్లో భాగంగా 102 గ్రామసభలకు గానూ ఈనెల 20న (శుక్రవారం) సీతంపేట మండలంలోని 20 గ్రామాల్లో పీసా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈ 20 పీసా గ్రామసభల ద్వారా ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ ఎన్నికలను సర్పంచ్ అధ్యక్షతన, ప్రాజెక్ట్ అధికారి ద్వారా నియమించబడిన ఎన్నికల అధికారులచే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవికి పోటీ చేయు అభ్యర్థులు సంబంధిత పీసా గ్రామసభలో ఓటు హక్కు కలిగి ఉన్న గిరిజనులై ఉండాలని సూచించారు. అలాగే పోటీ చేయు అభ్యర్థులు తమ నామినేషన్‌ను ఉదయం 9.30 గంటల నుంచి 11గంటల్లోపు సంబంధిత ఎన్నికల అధికారికి సమర్పించాలన్నారు. ఎన్నికలు నిర్వహించేఏందుకు మొత్తం ఓటర్లలో 1/3 కోరం తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే కోరంలో 50శాతం గిరిజనులై ఉండాలని సూచించారు. ఈ ఎన్నికలకు సంబంధిత గ్రామంలోని ఓటర్లంతా పాల్గొని ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ప్రజలను పిఒ కోరారు.

నేడు జరగబోయే పీసా గ్రామ సభలు ఇవే

మండలంలోని మర్రిగూడ, శంభం, ఆడలి, ఎగువతొత్తడి, పెదరామ, దేవనాపురం, దారపాడు, మానాపురం, మండ, బుడ్డడుగూడ, సామరెల్లి, జల్లార, కుడ్డపల్లి, కడగండి, రోలుగుడ్డి, గడిగుజ్జ, పుబ్బ, పెద్ద పల్లంకివలస, మూర్తిగాడిగూడ, దిగువ దారబ గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో ఎపిఒ తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఓండ్రుజోల ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను పరిశీలించి పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని అన్నారు. మెనూ పరిశీలించి మెనూ ప్రకారం భోజనాలు పెట్టడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. ఆర్వో ప్లాంట్ పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆర్ఒ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎపిఒ చినబాబు

పనులను వేగవంతం చేయాలి

ఐటిడిఎ పరిధిలో చేపడుతున్న మల్టీపర్పస్ సెంటర్ భవన నిర్మాణ పనులను వేగవంతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎపిఒ చిన్నబాబు అన్నారు. మండలంలోని గౌరీపేటగూడ, బంజరుగూడ గ్రామాల్లో చేపడుతున్న మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించ కూడదన్నారు. అదే విధంగా పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిఎంఎవై ఇళ్లు మంజూరు

ప్రజాశక్తి - పాలకొండ

భామిని, పాలకొండ, పాలకొండ అర్బన్, వీరఘట్టం జియ్యమ్మ వలస, కురుపాం మండలాల్లో ఇళ్లు లేని పేదలు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం 2.0 స్కీమ్ కింద ఇళ్ల మంజూరు నిమిత్తం సచివాలయాల్లో ఆన్లైన్ చేసుకోవాలని పాలకొండ డివిజన్ హౌసింగ్ అధికారి జి. రవి గురువారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు, కుటుంబం సభ్యుల ఆధార్ కార్డులు, బ్యాంక్ లింకేజ్ పాస్ బుక్, పొజిషన్ సర్టిఫికేట్, ఆదాయ దవీకరణ పత్రం, తదితర వివరాలతో సొంత స్థలం కలిగిన వారు సచివాలయంలో సంప్రదించి ఆన్లైన్ నందు నమోదు చేసుకోవాలని సూచించారు. తదితర వివరాలకు సమీప గ్రామ, వార్డు సచివాలయాల్లోనైనా, పై మండలాల్లో గల ఎఇలను, కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని అన్నారు.

సాలూరు రూరల్: ప్రధాన మంత్రి ఆవాస యోజన అర్బన్‌కు సంబంధించి సొంత ఇళ్ల స్థలాలు ఉన్న అభ్యర్థులు సొంత ఇంటి నిర్మాణానికి ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. ఆసక్తి గల ఇంటి యజమానులు ఆన్‌లైన్ చేసుకోవడానికి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, కులధ్రువీకరణ పత్రంతో పాటు ఇంటి స్థల పత్రాలను వార్డు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేయడం అన్యాయం

ప్రజాశక్తి - కొమరాడ

రెండున్నర ఎకరాల నుండి 5 ఎకరాల్లోపు భూమి గల రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చే సబ్సిడీ పథకాన్ని నిలిపివేయడం అన్యాయం అని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కొంతవరకు ఉచిత విద్యుత్తు సబ్సిడీ ఇచ్చి పథకాన్ని కొనసాగించిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలైనా ఈ పథకాన్ని ప్రారంభించకపోవడం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుకు ఎన్టీఆర్ జలసిరి పథకం ద్వారా విద్యుత్ వ్యవసాయ పంపుసెట్లను మంజూరు చేసి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లక్ష్మయ్య గిరిజన రైతులు పాల్గొన్నారు.

టీచర్ కుటుంబానికి రూ.కోటి పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

చిత్తూరు జిల్లాలో పోలీసు స్టేషన్ నుంచి పరీక్ష పేపర్లు పాఠశాలకు తీసుకెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు సిద్ధయ్య శెట్టి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు డిమాండ్ చేశారు. పరీక్ష పేపర్లు లీక్ అవుతున్నాయనే నెపంతో ఉపాధ్యాయులనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తీసుకెళ్లాలని విద్యాశాఖ అధికారులు ఒత్తిడి చేయడం వల్లే సిద్ధయ్య శెట్టి రోడ్డు ప్రమాదానికి గురయ్యారని చెప్పారు. పోలీసు స్టేషన్ నుంచి పరీక్ష పేపర్లు నేరుగా పాఠశాలలకే పంపించాలని గతంలో కోరినా అధికారులు పట్టించుకోలేదని చెప్పారు.

సాగు భూమిని కాజేసేందుకు కుట్ర

రెవెన్యూ సదస్సులో బాధిత రైతుల ఆవేదన

ప్రజాశక్తి - కొమరాడ

తమ తాత, ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూమిని కాసులకు కక్కుర్తి పడి రెవెన్యూ అధికారులు ఇతరుల చేతుల్లోకి అప్పజెప్పేందుకు ప్రయత్నించడం దుర్మార్గపు చర్య అని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దుగ్గిలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో బాధిత రైతులు అధికారులు ముందు వాపోతూ ఈ విషయాలు వివరించారు. దుగ్గి రెవెన్యూ పరిధిలో గల సుమారు 19 ఎకరాల భూమి గత 65 ఏళ్ల నుంచి గ్రామానికి చెందిన 23మందిమి సాగు చేసుకుంటున్నామని రైతులు తెలిపారు. 65 ఏళ్ల క్రితం నుంచి గ్రామాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయిన పిట్ట జమ్మయ్యకు ఇక్కడ 18 ఎకరాల భూముందని గతంలో ఇక్కడ పనిచేసిన విఆర్ఒ మాదలింగి ధనుంజయరావు రికార్డుల్లో చూపించినప్పటి నుంచి తమకు ఇబ్బందులు మొదలయ్యాయని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మయ్య నుంచి ముడుపులు అందుకున్న విఆర్ఒ తమ భూములను కబ్జా చేసేందకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఆ వ్యక్తి పేరున చేయించాలని మ్యుటేషన్ చేయాలని ప్రస్తుత ఆర్ఒపై ఒత్తిడి తెస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని బాధిత రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఎట్టకేలకు చిదిమి రోడ్డు పనులు పూర్తి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి గ్రామ బిటి రహదారి నిర్మాణ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.కోటీ40 లక్షలతో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు గత ఏడాది జులై 21న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శంకుస్థాపన చేశారు. అప్పట్లో రహదారికి ఇరువైపుల బెరమలు వేసి రహదారి 40 ఎంఎం షిప్పువేసి రోలింగ్ చేసి అర్ధాంతరంగా పనులను నిలిపివేశారు. దాదాపుగా 17 నెలల తర్వాత గ్రామానికి బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దూరులో ప్రత్యేక వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని దశమంతపురం పంచాయతీ పరిధి పెద్దూరులో గురువారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు, రక్తపోటు, మధుమేహ, జ్వర పీడితులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ,ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థుల్లో ఆరోగ్యపరమైన సమస్యలు ముందస్తుగా గుర్తించడానికి నిర్వహిస్తున్న హెల్త్ స్క్రీనింగ్ జరుగుతున్న తీరును వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్ గురువారం పరిశీలించారు. ఈ మేరకు స్థానిక సంస్కృత ఉన్నత పాఠశాల, ఎంజెపిఎపి బిసి సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది చేపడుతున్న ఆరోగ్య పరీక్షలు, స్క్రీనింగ్ వివరాల రికార్డులను తనిఖీ చేసి ఆన్లైన్ నమోదు తీరును పరిశీలించారు. వైద్యారోగ్య శాఖ నిర్దేశించిన చెక్ లిస్ట్ ప్రొఫార్మా ప్రకారం అధికారులు అక్కడ స్క్రీనింగ్ వివరాలపై ఆరా తీసి నమోదు చేశారు. స్క్రీనింగ్‌కు అవసరమైన పరికరాలు, కిట్లు సిద్ధంగా ఉన్నాయా? ఆరోగ్య నివేదికలు కచ్చితంగా నమోదు చేస్తున్నారా, మొత్తం విద్యార్థులు ఎంత మంది ఉన్నారు, ఇప్పటివరకు ఎంత మందికి స్క్రీనింగ్ పూర్తి చేశారు, వారిలో ఆరోగ్య సమస్యలు, వ్యాధులు, వైకల్యం, పుట్టుక లోపాలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఎంత మందిని గుర్తించారు, వైద్యాధికారి ఎంతమందికి చికిత్స అందజేశారు, ఎంత మందిని దగ్గర్లో ఉన్న ఆసుపత్రులకు డిఇఐసికి రిఫర్ చేశారు మొదలగు వివరాలను పరిశీలించారు. స్క్రీనింగ్ పారదర్శకంగా నిర్వహిస్తున్నారా, లేదా అని అక్కడ కొంత మంది విద్యార్థులకు స్క్రీనింగ్ చేయించి నివేదికలు గమనించారు. విద్యార్థుల సిక్ రిజిస్టర్ పరిశీలించి ఏ విధమైన ఆరోగ్య సమస్యలు నమోదు చేస్తున్నారో తెలుసుకున్నారు. వైద్య, ఉపాధ్యాయ సిబ్బంది సమన్వయంతో విద్యార్థుల ఆరోగ్య శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. అనంతరం పలు ఆరోగ్యపరమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్తహీనత, సీజనల్ వ్యాధులు, పరిశుభ్రత, పోషకాహారం తదితర అంశాలపై వివరించారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.హేమసుందర్ నాయుడు, మహమ్మద్ షకీల, హెల్త్ సూపర్వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది విజయ, సావిత్రి, స్టాఫ్ గౌతమి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత రెండు రోజులుగా మండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులకు శిక్షణా తరగతులు జరిగాయి. గురువారం శిక్షణా తరగతులకు హాజరైన ఎంపిపి బి.ప్రమీల మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో సుస్థిర లక్ష్యాలు సాధించాలని అన్నారు. పేదరికం లేని,మెరుగైన జీవన ఉపాధి, ఆరోగ్యవంతమైన సమృద్ధి మౌలిక సదుపాయాలతో కూడిన గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బివిజె పాత్రో, ఇఒపిఆర్‌డి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: గ్రామీణాభివృద్ధిపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిడిఒ జి.పైడితల్లి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణాభివృద్ధిపై సర్పంచులు, మండల స్థాయి అధి కారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం గురువారం ముగింపు సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధిపై ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, బి.వెంకటాపురం సర్పంచ్ బొత్స లక్ష్మి, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ నాలి అర్జునరావు, ఎపిఒ మండల గౌరీనాథ్, ఎపిఎం పి.అప్పలనాయుడు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

జంఝావతి ప్రాజెక్టు సాధన యాత్రకు సిపిఐ మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జంఝావతి ప్రాజెక్టు పూర్తికి, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ చేస్తున్న సాధన యాత్రకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని గురువారం నాడు ప్రకటనలో కోరారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తి ఈ ప్రాంత ప్రజల చిరకాల కల రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.అప్పలనాయుడు, సిపిఐ నాయకులు టి.జీవ, జి.సూరయ్య అభిప్రాయపడ్డారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తికి వివిధ రూపాల్లో ఆందోళన చేశామన్నారు. ఈనెల 23 నుంచి వెంకంపేట, చినబొండపల్లి, పెదబొండపల్లి జంక్షన్ జరుగు సభలకు సంపూర్ణ సహకారం మద్దతు ఉంటుందని అన్నారు,

కోటదుర్గమ్మను దర్శించుకున్న దేవాదాయశాఖ కమిషనర్

ప్రజాశక్తి - పాలకొండ

ఉత్తరాంధ్రా ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీరామసత్యనారాయణ కుటుంబసభ్యులతో గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కమిషనర్ వెంట ఎసి సీపాన రాజారావు, సీనియర్ అసిస్టెంట్ రాజు, ఆలయ ఇఒ వివి సూర్యనారాయణరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక మినీ గురుకులం, కెజిబివి పాఠశాలల్లోని విద్యార్థులకు దోనుబాయి పిహెచ్‌సి వైద్యాధికారి భానుప్రతాప్ గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. చలిగాలికి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వేడి ఆహారం, నీళ్ల తాగాలని సూచించారు. అనంతరం ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. అదేవిధంగా పాఠశాలలో కిచెన్ గార్డెన్, వంటగదులను పరిశీలించారు. విద్యార్థులకు భోజనాలు ఏ విధంగా ఉన్నాయని రుచి చూశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శీతాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి వెంట ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యుత్తు కాంతుల నడుమ చర్చీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక తెలుగు బాప్టిస్ట్ , ఆర్‌సిఎం సీయోను చర్చిలతో పాటు చిట్టిపూడివలస, చలివేంద్రి, తూడి, తలవరం, వండువ, బిటివాడ తదితర గ్రామాల్లోని చర్చిలు విద్యుత్తు వెలుగులు వెదజల్లుతున్నాయి. క్రిస్మస్ పండగ సందర్భంగా దేవాలయాలు విద్యుత్తు అలంకరణతో దర్శనమిస్తాయి.


అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న సిసి తిరుపతిరావు

లింగ వివక్షను విడనాడాలి

గరుగుబిల్లి : నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, పురుషులతో సమానంగా మహిళలకు చట్టం హక్కులు కల్పించిందని వాటిని సమర్థవంతంగా అమలు చేయాలని స్థానిక ఎపిజివి బ్యాంకు మేనేజర్ దీక్షిత అన్నారు. లింగ వివక్షతపై అవగాహన వెలుగు అధికారుల సహకారంతో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వెలుగు సిసి తిరుపతి రావు మాట్లాడుతూ ఇళ్లలోనూ, పని ప్రదేశాల్లో మహిళలను గౌరవించాలని, వారి హక్కులను కాపాడాలని తెలిపారు. మహిళల హక్కులను కాపాడేందుకు రూపొందించిన గృహ హింస చట్టాలపై ప్రతి మహిళకు అవగాహన ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఐకెపి సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

8 కేజీల గంజాయి స్వాధీనం

పాచిపెంట : మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద బుధవారం నలుగురు వ్యక్తుల నుంచి 8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు. బుధవారం సాయంత్రం చెక్‌పోస్ట్ సమీపంలో నలుగురు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని విచారించి బ్యాగులు తనిఖీ చేశారు. ఆ బ్యాగుల్లో సుమారు 8 కేజీల గంజాయి లభించింది. నలుగురు వ్యక్తులు తమిళనాడుకు చెందినవారు. వీరు ఒడిశాలోని కోరాపుట్ నుంచి చెన్నైకు గంజాయి తరలిస్తున్నారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.